శ్రీశైలానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలి

మాడ్గుల, అక్టోబరు 9 : శ్రీశైలం దేవస్థానానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మాడ్గుల మాజీ సర్పంచ్ కాట్ల యాదయ్యగౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సూదిని శరత్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. హైదరాబాద్ నుంచి ఇబ్రహీంపట్నం, మాల్, మాడ్గుల, ఇర్విన్, చారకొండ, డిండి మీదుగా శ్రీశైలానికి నడిచే బస్సును కరోనా నుంచి రద్దు చేశారని తెలిపారు. త్వరలో బస్సును పునరుద్ధరిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. శివ మహేష్ గౌడ్, మారేపల్లి శివగౌడ్ పాల్గొన్నారు.

నేత్రపర్వం.. సరస్వతీ దేవి అలంకారం



మహేశ్వరం శ్రీ రాజరాజేశ్వరాలయంలో దేవీ శరన్నవ రాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం అమ్మవారు సరస్వతీ దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఫలరసాభిషేకం, సహస్రనామార్చన, మంత్రపుష్పంతో పాటు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. పూజల్లో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, అందెల శ్రీరాములు యాదవ్, ఆలయ కమిటీ చైర్మన్ కుమార్, నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, పోతర్ల సుదర్శన్ యాదవ్, నవీన్, కృష్ణ, ఈవో మురళీకృష్ణ, రాజు, రాజేష్, రాములు, చందు, నరేష్ పాల్గొన్నారు.

మహేశ్వరం, అక్టోబరు 9 :

పెళ్లి సందడి

మూడు నెలల పాటు బ్రహ్మాండమైన ముహూర్తాలు

- 12 నుంచి మోగనున్న పెళ్లి బాజాలు
- ఒక్కటి కానున్న వేలాది జంటలు
- కొనుగోళ్లతో కిటకిటలాడుతున్న మార్కెట్లు
- ఫంక్షన్ హాళ్లు, బ్యాంకెట్ హాళ్లకు ఫుల్ బుకింగ్‌లు
- డెకరేషన్, క్యాటరింగ్, వాయిద్య బృందం, ఫొటో, వీడియోగ్రాఫర్లకూ డిమాండ్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్) : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెళ్లి సందడి మొదలు కానుంది. వచ్చే మూడు నెలలు శుభ ముహూర్తాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉందని పురోహితులు చెబుతున్నారు. రెండుమూడేళ్లలో జిల్లాలో జరిగిన వివాహాలతో పోల్చితే ఈ మూడు నెలల్లో దాదాపు 2-3 వేల వరకు అత్యధికంగా జరగనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఫంక్షన్‌హాళ్లు, బ్యాంకెట్ హాళ్లకు అడ్వాన్స్ బుకింగ్‌లు పెరిగాయని నిర్వాహకులు చెబుతున్నారు. ఈనెల 12వ తేదీ నుంచి మంచి ముహూర్తాలు ఉన్నట్లు పురోహితులు తెలిపారు. ఇప్పటికే పెళ్లి సంబంధాలు కుదుర్చుకున్న వారు నిశ్చయ తాంబులాలు మార్చుకుని వివాహానికి సిద్ధమవుతున్నారు. ఫంక్షన్‌హాళ్లు, బ్యాంకెట్ హాళ్లను బుకింగ్ చేసుకున్నారు. ఈ నెలలో దసరా పండగ తోపాటు శుభ కార్యాలు ఉండటంతో మార్కెట్లు కిటకిలాడుతున్నాయి. వస్త్ర, బంగారం దుకాణాల్లో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. బంగారం ధర పెరిగినప్పటికీ ఆభరణాలు తయారీకి భారీగా ఆర్డర్లు వస్తున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.



శుభ ముహూర్తాలివే..

అక్టోబరు నుంచి డిసెంబర్ వరకు మూడు నెలల పాటు శుభ ముహూర్తాలు ఉన్నాయి. ఈ నెలలో 12,13,16,20,27 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉండగా, నవంబర్‌లో 3,7,8,9.10,13,14,16,17, డిసెంబర్‌లో 5,6,7,8,11,12,14,15,26 తేదీల్లో శుభకార్యాలకు అనువైన రోజులుగా పురోహితులు చెబుతున్నారు. దీంతో ఈ ఏడాది వివాహాలు చేసుకోవాలనే వారు ఈ ముహూర్తాల్లో డేట్ ఫిక్స్ చేసుకుంటున్నారు. ముహూర్తాలు పెట్టుకున్నవారు మండపాలు అలంకరించే వారికి, కేటరింగ్ వారికి ఆర్డర్లు ఇస్తున్నారు. ఫొటో, వీడియోగ్రాఫర్లకు ఫుల్లు డిమాండ్ ఏర్పడింది. ఎంగేజ్‌మెంట్ పూర్తి చేసుకున్న దంపతులు ఫొటో షూట్‌లు చేస్తూ బిజీగా ఉన్నారు. ఫంక్షన్‌హాళ్ల అన్నీ దాదాపు ముందస్తుగా బుకింగ్ అయినట్లు నిర్వాహకులు చెబుతున్నారు.



బుకింగ్‌లు అధికంగా వస్తున్నాయి



మూడు నెలల పాటు శుభ ముహూర్తాలు ఉండటంతో బుకింగ్‌లు అధికంగా వస్తున్నాయి. ఈ నెలలో దాదాపు ఐదు బుకింగ్‌లు ఉన్నాయి. వచ్చే నెలకు సంబంధించి కొందరు బుకింగ్‌లు చేసుకుంటున్నారు. మేము అన్ని రకాల డెకరేషన్‌లు చేస్తూ పది మందికి ఉపాధి కల్పిస్తున్నాం.

- షాబాద్ సన్నీ, ఈవెంట్ మేనేజర్, మొయినాబాద్ మండలం

నెల ముందుగానే..



పెళ్లి ముహూర్తం ఫిక్స్ చేసుకున్నవారు ఒక నెల ముందుగానే గార్డెన్‌ను బుక్ చేసుకున్నారు. ఈ నెలలో ఎక్కువ బుకింగ్‌లు ఉన్నాయి. నవంబర్, డిసెంబర్‌కు సంబంధించి బుకింగ్‌లు కూడా కొన్ని వచ్చాయి. గార్డెన్‌లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.

- దేవులపల్లి రాకేష్‌గౌడ్, గార్డెన్ మేనేజర్, హిమాయత్‌నగర్, మొయినాబాద్ మండలం

అద్భుతమైన ముహూర్తాలు



అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌లో 23 అద్భుతమైన ముహూర్తాలు ఉన్నాయి. ఈ నెలల్లో పెళ్లిళ్ల, గృహ ప్రవేశాలు, ఉపనయనాలు, తదితర శుభకార్యాలకు ఈనెల ఎంతో అనుకూలం. ఈ మూడు నెలలు పురోహితులతో పాటు శుభకార్యాల నిర్వాహకులకు చేతి నిండా పనులు ఉంటాయి.

- పద్మాకర చార్యులు, ఏకదంతిమఠ సంస్థాన పురోహితుడు

పనులు త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ శశాంక
- మహేశ్వరం మెడికల్ కళాశాల భవనం పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 9: మండల పరిధిలోని మంగల్‌పల్లి సమీపంలో భారత్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న మహేశ్వరం మెడికల్ కళాశాల భవనాలను కలెక్టర్ శశాంక బుధవారం పరిశీలించారు. పక్కా భవనం నిర్మించే వరకు ఇక్కడ అద్దె ప్రాతిపదికన మెడికల్ కళాశాలను నిర్వహించనున్నారు. ఈ భవనంలో కావాల్సిన వసతులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సిబ్బంది నియామకం, ల్యాబ్‌లు, హాస్టల్ వసతిపై అధికారులతో చర్చించారు. కొంతకాలంపాటు ఇక్కడ వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది సేవలను వినియోగించుకోనున్నారు. కాగా ఆయన వెంట ఇబ్రహీంపట్నం ఆర్డీవో కె.అనంతరెడ్డి, సంబంధిత అధికారులున్నారు.

'ఈ-ఆఫీసు' ఫైళ్లనే పరిశీలిస్తాం

రంగారెడ్డి అర్బన్ : ఈ-ఆఫీసు విధానంలో వచ్చిన ఫైళ్లను మాత్రమే పరిశీలిస్తామని కలెక్టర్ శశాంక స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిపాలన ఫైళ్ల విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు.ఇప్పటి వరకు ఈ-ఫైల్ విధానంలో ట్రైనింగ్ తీసుకోని, టోకన్లు అందుకోని అధికారులు త్వరతగతిన ఈ-ఆఫీస్ టోకన్‌లు కొనుగోలు చేయాలని తెలిపారు. ప్రతీ శాఖ అధికారిక ఈమెయిల్ వాడాలని సూచించారు. ఇప్పటికే ప్రాథమిక దశలో ఈ-ఆఫీస్ నిర్వహణపై రెండు దఫాలుగా జిల్లా వివిధ శాఖల అధికారులకు, శాఖల సిబ్బందికి శిక్షణ ఇచ్చామని తెలిపారు. జిల్లాలో అమలుపరుస్తున్న ఈ-ఆఫీస్ ప్రణాళికల సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్ని శాఖలకు అందించామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో సంగీత, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, ఎన్ఐసీ అధికారి స్వర్ణలత పాల్గొన్నారు.

ఫార్మాసిటీని రద్దు చేయాల్సిందే..

బతుకమ్మ ఆడి నిరసన తెలిపిన యాచారం మండల రైతులు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు, రైతులు

యాచారం, అక్టోబరు 9 : యాచారం మండలంలో ఫార్మాసిటీ ఏర్పాటు చేయొద్దని రైతులు డిమాండ్ చేశారు. మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామ రైతులు బుధవారం మేడిపల్లిలోని ఫార్మాసిటీ వ్యతిరేక స్థూపం వద్ద బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేస్తామని కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చి తప్పిందని ఆరోపించారు. "విషం చిమ్మే కంపెనీలు మాకొద్దు ఉయ్యాలో.. రైతుల పట్టా భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి ఉయ్యాలో.. నమ్ముకున్న కాంగ్రెస్ ఉయ్యాలో.. మాగోడు వింట లేదు ఉయ్యాలో.. అని పాటలు పాడుతూ ప్రభుత్వానికి నిరసన ప్రకటించారు. ఈ సందర్భంగా ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు బర్లమల్లేష్, నిరంజన్, నారాయణ తదితరులు మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఫార్మాసిటీ రద్దు చేసి ఆదుకుంటామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, నేడు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.

లక్ష్మీ వేంకటేశ్వరుడికి వెండి ఆభరణాల బహూకరణ



ఆభరణాలు అందిస్తున్న మణికొండ రంగయ్య కుటుంబీకులు

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 9: పట్టణానికి ముఖద్వారంగా వెలసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామికి స్థానిక రామకృష్ణ థియేటర్ యజమాని మణికొండ రంగయ్యగౌడ్ ఆయన కుమారుడు హర్షవర్ధన్‌గౌడ్ దంపతులు బుధవారం మూడు కిలోల వెండి ఆభరణాలను సమర్పించారు. ఖడ్గం, వడ్డాణం, లక్ష్మీ కాసులహారంతో పాటు గోదాదేవి హస్తంలకు ఆలయ ప్రధాన పూజారి శ్రీనివాసచార్యులు పూజ చేశారు. అనంతరం రంగయ్యగౌడ్, హర్షవర్ధన్‌గౌడ్ దంపతులు ఆలయ పూజారికి ఆభరణాలను అందజేశారు.

పురవీధుల్లో ఊరేగిన వేంకటేశ్వర స్వామి



స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

చేవెళ్ల, అక్టోబరు 9 : మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం, సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురవీధుల్లో ఊరేగింపు చేపట్టారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని కోలాటం ఆడారు. ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది. ధర్మకర్తలు దేవుని వామనాచార్యులు, పూజారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

శంషాబాద్, అక్టోబరు 9 : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని వివిధ బస్తీల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మండపాల వద్ద దుర్గామాతకు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శారదానగర్‌లోని శ్రీ శంకరమఠంలో అమ్మవారు బుధవారం సరస్వతీ అలంకరణలో దర్శనమిచ్చారు. మండపం వద్ద మహిళలు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన చేశారు.

యువతను ప్రోత్సహించేందుకే క్రీడలు



బహుమతి అందిస్తున్న అదనపు డీసీపీ

మొయినాబాద్ రూరల్, అక్టోబరు 9: గ్రామీణ యువకుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో క్రీడాపోటీలను నిర్వహిస్తున్నామని రాజేంద్రనగర్ జోన్ అదనపు డీసీపీ విజయ్ తెలిపారు. మొయినాబాద్ మండల పోలీసుల ఆధ్వర్యంలో కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ టోర్నీలో గెలుపొందిన జట్లకు బుధవారం ఆయన బహుమతులు అందజేశారు. సీఐ పవన్‌కుమార్ రెడ్డి, ఎస్సై ముజఫర్ అలీ, పోలీసు సిబ్బందితో పాటు కళాశాల ఇన్‌చార్జి రవికిరణ్‌రెడ్డి తదితరులున్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

ఆమనగల్లు, అక్టోబరు 9: పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆలయంలో బుధవారం చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. సరస్వతీ దేవికి పూజలు నిర్వహించిన అనంతరం తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఎంగిళి బాలకృష్ణ, అప్పం శ్రీను, రమేశ్, రాఘవేందర్, యాదగిరి, సోమశేఖర్, శ్రీధర్, చంద్రమౌళి, నిరంజన్, ఆంజనేయులు, ప్రసాద్, రవి పాల్గొన్నారు.

మాదిగల ద్రోహి సీఎం రేవంత్‌రెడ్డి : నర్సింహ



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న నర్సింహ మాదిగ

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 9 : సీఎం రేవంత్‌రెడ్డి మాదిగల ద్రోహి అని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటానోళ్ల నర్సింహ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలులోకి వచ్చేంత వరకూ ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం డీఆర్వో సంగీతకు వినతిపత్రం ఇచ్చారు. ఎస్సీ వర్గీకరణ వెంటనే అమల్లోకి తీసుకురావాలని, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆయన తెలిపారు.


తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ ముల్లి పావని

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చర్యలు

ఘట్‌కేసర్, అక్టోబరు 9: మున్సిపాలిటీ ప్రజల దాహార్తిని తీర్చడానికి ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నట్లు ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో గల దత్తాత్రేయనగర్‌లో బుధవారం రూ.5లక్షల స్పెషల్ డెవలప్ ఫండ్ నిధులతో చేపట్టిన తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ ఎండీ సాబేర్ అలీ, కౌన్సిలర్లు బొక్క సంగీతా ప్రభాకర్‌రెడ్డి బేతాల నర్సింగ రావు, నాయకులు సుధాకర్‌రావు, సంజీవరెడ్డి, అనుజ, స్థానికులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ సైంటిస్టు బాబురావు

నేవీ రాడార్ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ఉపసంహరించుకోవాలి

రాంనగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దామగుండం అడవుల్లో ఏర్పాటు చేసే నేవీ రాడార్ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ఉపసంహరించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో రిటైర్డ్ సైంటిస్టు కె.బాబురావు, ప్రజాసంఘాల నేతలు వి.సంధ్య, జి.ఝాన్సీ, విజయబండారు, శాంతిప్రభోద, పైడిమర్రి గిరిజ, గీత, సజయలు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ పర్యావరణాన్ని, ప్రజల భవిష్యత్‌ను సమష్టిగా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఈఐఏ నివేదిక ప్రజా బాహుళ్యంలో అందుబాటులో లేదన్నారు.


మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీసీఐ ఉద్యోగులు

సీసీఐ ఫ్యాక్టరీని ఆధునీకరించండి

తాండూరు రూరల్, అక్టోబరు 9: మండలంలోని కరన్‌కోట్ సమీపంలో ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సిమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఫ్యాక్టరీని ఆధునీకరించాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సీసీఐ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. సీసీఐ ఎంప్లాయీస్ యూనియన్ ఉద్యోగులు బుధవారం తాండూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఉద్యోగులు బాలశంకర్, వంశీకృష్ణ, చంద్రలాల్, కిరణ్ ఉన్నారు.

అశ్వవాహనంపై శ్రీవారు

వికారాబాద్, అక్టోబరు 9 : శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు 7వ రోజు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం నుంచి సుప్రభాత సేవ, మహాభిషేకం నైవేద్యం, అర్చనలు నిర్వహించి భక్తులకు దర్శనాలు కల్పించారు. ఉదయం 11 గంటలకు స్వామి వారి కల్యాణం జరిపించారు. సాయంత్రం 6 గంటలకు స్వామి వారిని అశ్వవాహనంపై ఊరేగించారు. అనంతరం మహిళలు బతుకమ్మ ఆడారు. ఈ వేడుకల్లో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డితో పాటు బీజేపీ నాయకులు మాధవరెడ్డి, వడ్లనందు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. వారిని ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

సంస్కృతీ, సంప్రదాయాలను పాటించాలి

కులకచర్ల, అక్టోబరు 9: ప్రతీఒక్కరు సంస్కృతీ సంప్రదాయాలను పాటించాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఘనపూర్ గ్రామంలో బుధవారం బీజేపీ జిల్లా నాయకుడు వెంకటయ్యగౌడ్ ఆధ్వర్యంలో నిర్మించిన రామలింగేశ్వర గోశాల షెడ్డును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పరిగి నియోజకవర్గ ఇన్‌చార్జి మారుతి కిరణ్‌బూనేటి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్నె ఈశ్వరప్ప, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్య రెడ్డి, భీమ్‌రెడ్డి, సురేశ్, భాస్కరయోగి, రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


స్వామివారిని దర్శించుకుంటున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

నరేందర్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికం

వికారాబాద్, అక్టోబరు 9: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మా కంపెనీల పేరుతో రైతుల భూములను లాక్కోవడాన్ని నిరసిస్తూ శాంతియుతంగా పాదయాత్ర చేసి నిరసన తెలిపేందుకు సిద్ధమైన నరేందర్‌రెడ్డిని అరెస్టు చేయడమేంటని ప్రశ్నించారు. ప్రజాపాలన అంటూ గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం, ఇనుప కంచెలు తొలగించామని, ధర్నా చౌక్ తెరిచామని ఒక వైపు చెబుతూ మరోవైపు ప్రజాస్వామ్యయుతంగా శాంతియుతంగా పాదయాత్ర చేపడితే ఎందుకు అడ్డుకుంటుందని ప్రశ్నించారు. అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని, ఫార్మాసిటీ కోసం ఇప్పటికే సిద్ధంగా ఉన్న భూములను వదిలిపెట్టి కొడంగల్ పరిధిలోని ఐదు గ్రామాల్లోని 3వేల ఎకరాల భూమి సేకరించాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ప్రజాభిప్రాయాన్ని గౌరవించి వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజలు వద్దంటున్నా పరిశ్రమలెందుకు?

పరిగి: ప్రజలు వద్దంటున్నా ఏ పరిశ్రమ అయినా ఎందుకు ఏర్పాటు చేయడమని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మాసిటీ ఏర్పాటుకు వ్యతిరేకంగా బుధవారం మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర నేపథ్యంలో మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి వారికి దుద్యాల్‌లో అరెస్ట్ చేసి పరిగి పీఎస్‌కు తరలించారు. ఇక్కడ మాజీ మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి శాంతియుత పాదయాత్రకు పోలీసులు అనుమతిచ్చి తిరిగి అరెస్టులు చేయడమేంటని ప్రశ్నించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసే హక్కు లేదా? అని ప్రశ్నించారు. ప్రజలకు నష్టం చేసే పరిశ్రమల ఏర్పాటును తాము వ్యతిరేకిస్తామని తెలిపారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పక్కన మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

చేపల పెంపకంతో మత్స్యకారులు అభివృద్ధి చెందాలి

శామీర్‌పేట, అక్టోబరు 9: చేపల పెంపకంతో మత్స్యకారులు అభివృద్ధి చెందాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బుధవారం వారు ముఖ్య అతిథులుగా హాజరై శామీర్‌పేట పెద్దచెరువు నీటిలో చేపపిల్లలను వదిలారు. ప్రభుత్వం నుంచి 100శాతం సబ్సిడీ కింద 80-100 ఎంఎం సైజ్‌లో ఉన్న 3,60,000 కట్ల, రవ్వ, మోను, రకాల విత్తన చేపపిల్లలను వారు చెరువు నీటిలో వదిలారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫిష్ ఫెడరేషన్ ఛైర్మన్ మెట్టు సాయి, జిల్లా మత్స్య సహకార సంఘం ఛైర్మన్ మన్నె రాజు, మోహన్‌కృష్ణ, వేణుగోపాల్, వెంకటేశం, దేవేందర్, అనురాధ, సత్యవతి, రాము పాల్గొన్నారు.


చేపపిల్లలను వదులుతున్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి


కేక్ కట్‌చేసి ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

నూజివీడు సీడ్స్ నుంచి కొత్త రకం గోధుమ విత్తనం

మేడ్చల్ టౌన్, అక్టోబరు 9: భారత ప్రభుత్వంతో ఆమోదించబడిన న్యూ- 2194 బాద్షా గోధుమ కొత్త విత్తనాలను బుధవారం నూజివీడు సీడ్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మండవ ప్రభాకర్ రావు ప్రారంభించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ పరిధిలోని నూజివీడు కార్పొరేట్ కార్యాలయంలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సంస్థ ఎండీ వర్చువల్‌గా ప్రారంభించగా, మార్కెటింగ్ ప్రతినిధులు కేక్ కట్ చేశారు.

మొక్కజొన్న పంటల పరిశీలన

మోమిన్‌పేట్, అక్టోబరు 9: మొక్కజొన్న పంట సాగులో రెండు బుట్టలు అంతకంటే ఎక్కువ మక్కా బుట్టలు ఉన్నాయని మండలంలోని ఎన్కెపల్లి గ్రామానికి చెందిన రైతు దంగేరి నర్సింహులు ఫిర్యాదు చేయడంతో బుధవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి జొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నివేదికను శాస్త్రవేత్తలకు పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు జయశంకర్, శ్రీనివాసులు, రైతు నర్సింహులు పాల్గొన్నారు.


పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి

డీఎస్సీ ఎంపిక జాబితాలో తప్పులు సవరించాలి

వికారాబాద్, అక్టోబరు 9: డీఎస్సీ 2024 1:1 ఫైనల్ లిస్టులో తప్పులను వెంటనే సరిచేయాలని డీఎస్సీ అభ్యర్థులు డిమాండ్ చేశారు. జిల్లా విద్యాధికారి రేణుకదేవిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీఎస్సీ 2024 ఎస్‌జీటీ తెలుగు మీడియం స్పోర్ట్స్ కోటాలో 1:3 వెరిఫికేషన్ లిస్టులో లేని వారికి 1:1 ఫైనల్ లిస్టులో కొత్త వారి పేర్లు వచ్చాయని తెలిపారు. వెరిఫికేషన్ అయిన వారిలో మెరిట్‌ను చూసి భర్తీ చేయాలని కోరారు. డీఈవోకు ఫిర్యాదు చేసిన వారిలో స్వాతి, జంగయ్య, శివలీల, శ్రీలత ఉన్నారు.


డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటిన గురుకుల విద్యార్థినులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 9: అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల (మహేంద్రహిల్స్) డిగ్రీ కళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటారు. ఈ నెల 7, 8 తేదీల్లో హన్మకొండ జవహర్‌లాల్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో తొమ్మిది పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ స్నేహలత బుధవారం సాయంత్రం తెలిపారు. ఎన్.బుచ్చమ్మ అండర్-20 షాట్‌పుట్ విభాగంలో స్వర్ణం, డిస్కస్ త్రోలో రజత పతకం, టాబు 800 మీటర్ల పరుగు పందెంలో రజతం, 1500 మీటర్ల పరుగుపందెంలో కాంస్యం, పి.ఉషారాణి 500మీటర్ల పరుగుపందెంలో కాంస్యం, 3వేల మీటర్ల పరుగుపందెంలో కాంస్యం పతకం సాధించారు. అనూష హైజంప్‌లో కాంస్యం, సాత్వికాంజలి 400మీటర్ల హార్డిల్స్‌లో కాంస్యం, ఉషారాణి 800మీటర్ల పరుగు పందెంలో కాంస్యం పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ వివరించారు. వారిని ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకుడు డాక్టర్ రామలక్ష్మణ్, కోచ్ బిక్షపతియాదవ్ అభినందించారు.


మెడల్స్‌ను చూపుతున్న విద్యార్థినులు

ఉద్యమకారుల ఫోరం చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్‌గా మహేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల, అక్టోబరు 9 : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్‌గా యాలాల మహేశ్వర్‌రెడ్డి నియమితులయ్యారు. బుధవారం నగరంలో ఫోరం ఛైర్మన్ చీమ శ్రీనివాస్ మహేశ్వర్‌రెడ్డి పేరును ప్రకటించారు. చేవెళ్ల మండలం అల్లావాడ గ్రామానికి చెందిన మహేశ్వర్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర వహించారు. ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ముందుకు సాగుతానన్నారు. ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని పేర్కొన్నారు.



కిషన్‌నగర్‌లో బెల్ట్ షాపులను నిషేధించాలి

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు 9: ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్‌లో బెల్ట్ షాపులను నిషేధించాలని గ్రామస్తులు బుధవారం శంషాబాద్ డీసీపీని కలిసి వినతిపత్రం ఇచ్చారు. గ్రామంలో నిత్యం తెల్లవారు జామున 4గంటల నుంచి బెల్ట్‌షాపుల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, మద్యానికి యువకులు బానిసలై జీవితాలు పాడు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతోందన్నారు. కూలీలు అర్ధరాత్రి వరకూ బెల్ట్‌షాపుల వద్దనే ఉంటున్నారని పేర్కొన్నారు. గ్రామంలో మద్యం అమ్మకాలు జరగకుండా చూడాలని డీసీపీని కోరారు.


డీసీపీకి వినతిపత్రం ఇస్తున్న కిషన్‌నగర్ గ్రామస్తులు



సమావేశంలో మాట్లాడుతున్న పల్వాన్‌కుమార్

30 సంవత్సరాలు పైబడిన వారికి స్క్రీనింగ్ టెస్టులు

వికారాబాద్, అక్టోబరు 9: జిల్లాలో 30సంవత్సరాల వయస్సు పైబడిన వారందరికీ స్క్రీనింగ్ టెస్టులు చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పల్వాన్ కుమార్ తెలిపారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో బుధవారం రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ అబ్దుల్ వాసేతో కలిసి వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే మరణాల సంఖ్య తగ్గించవచ్చని తెలిపారు. జిల్లా పరిధిలో 4,29,030 మంది 30సంవత్సరాలు పైబడిన వారు ఉన్నారని, ఇప్పటికే 25శాతం మందికి స్క్రీనింగ్ పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ నిరోషా, డీఈఎంవో శ్రీనివాసులు, రేణుకుమార్, జయరాం పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను సన్మానిస్తున్న జీఎల్ఎన్ రెడ్డి, వీరయ్య, శ్రీను

రాష్ట్రంలో భయానక వాతావరణం

కడ్తాల్, అక్టోబరు 9: కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల ద్వారా రాష్ట్రంలో భయానక వాతావరణం ఏర్పడిందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అన్నారు. రైతుబంధు సాయమందక, పాల బిల్లులు రాక, బతుకమ్మచీరలు ఇవ్వక ప్రజలకు దసరా పండుగ సంతోషం కూడా లేకుండా పోయిందని విచారం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో బుధవారం జైపాల్‌ను బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు జోగు వీరయ్య, బీఆర్ఎస్ నాయకుడు గంప శ్రీనులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు జైపాల్ దసరా శుభాకాంక్షలు తెలిపారు.


పనులు ప్రారంభిస్తున్న లావణ్య దేవేందర్‌యాదవ్

ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం

కొత్తూర్, అక్టోబరు 9: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారిస్తున్నామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్ అన్నారు. మున్సిపాలిటీలోని 4వ వార్డులో రూ.6లక్షలతో నిర్మించనున్న మురుగునీటి కాలువ నిర్మాణం పనులను బుధవారం ఆమె ప్రారంభించారు. కమిషనర్ బాలాజీ, వైస్ ఛైర్మన్ జోలీ రవీందర్, కౌన్సిలర్లు సోమ్లనాయక్, మాదారం నర్సింహగౌడ్, కోస్గి శ్రీనివాస్, నాయకులు జె. శ్రీను, కమ్మరి జనార్దన్‌చారి, మాదారం కృష్ణగౌడ్, వీరమోని శ్రీనివాస్, రాఘవేందర్‌యాదవ్ తదితరులున్నారు.

డీఎస్సీలో 100 లోపు 18 ర్యాంకులు

వికారాబాద్, అక్టోబరు 9: ఏకేఆర్ స్టడీ సర్కిల్ విద్యార్థులు డీఎస్సీలో 100లోపు 18ర్యాంకులు సాధించినట్లు డైరెక్టర్లు బీవీ రమణ, స్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్ ప్రాంత విద్యార్థులలో 2024లో దాదాపు 150కి పైగా డీఎస్సీ ఉద్యోగాలను సాధించి రాష్ట్రంలోనే ఎక్కువ సక్సెస్ రేట్‌ను సాధించిన సంస్థగా ఏకేఆర్ స్టడీ సర్కిల్ రికార్డు సృష్టించిందని పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీ నుంచి టెట్, డీఎస్సీ, కానిస్టేబుల్ శిక్షణను ప్రారంభిస్తున్నట్లు వారు తెలిపారు. మరిన్ని వివరాలకు 9441022571 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

సభ్యత్వ నమోదును ముమ్మరంగా చేపట్టాలి

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు 9: ప్రతీ గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదును ముమ్మరంగా చేపట్టాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి వెంకటేష్ గుప్తా తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లంపల్లిలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. రాంచంద్రయ్య, శ్రీశైలం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనుల పరిశీలన

అధికారుల తీరుపై అడిషనల్ కలెక్టర్ అసహనం

బషీరాబాద్, అక్టోబరు 9: మండలంలోని మల్కాన్‌గిరి, దామర్‌చెడ్, బషీరాబాద్‌లోని టాకీతండాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు చేపట్టిన అభివృద్ధి పనులను వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎం.సుధీర్ బుధవారం పరిశీలించారు. దామర్‌చెడ్ పాఠశాలలో వాష్‌రూం, మరుగుదొడ్లకు కొన్నింటికి తాళాలు వేసి ఉండటంతో చేపట్టిన పనులను ఎలా పరిశీలిస్తామంటూ అక్కడున్న పంచాయతీరాజ్ ఏఈలపై అడిషనల్ కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. విద్యాధికారికి ఎక్కడున్నారంటూ అడుగగా అక్కడున్న అధికారులు రాలేదని చెప్పారు. శిథిలావస్థకు చేరిన దామర్‌చెడ్ పాఠశాల గ్రౌండ్‌లోని ఓహెచ్‌ఎస్ఆర్‌ను స్థానిక యువకులు అడిషనల్ కలెక్టర్‌కు చూపించారు. మల్కాన్‌గిరి పాఠశాలలో చేపట్టిన పనులతో పాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్ వసతి, సౌకర్యాలు సక్రమంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతకాలం విద్యుత్ సౌకర్యం లేకుండా ఎలా ఉన్నారని అక్కడున్న టీచర్‌ను ప్రశ్నించారు. వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇప్పించి ఫ్యాన్లు ఏర్పాటు చేయించాలని అక్కడున్న ఎంపీడీవో విజయ్‌కుమార్, గ్రామ కార్యదర్శి అశోక్‌కుమార్‌ను ఆదేశించారు. బషీరాబాద్‌లోని టాకీండాలో అంతకు ముందు నవాల్గ పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఆయన ఆసుపత్రి పరిసరాలు, లోపాల గదులను కలియతిరిగారు. బషీరాబాద్ ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లిన ఆయన గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశమై పాఠశాలల్లో అమ్మఆదర్శ కమిటీలు చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షిస్తూ పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో బాలరంగాచారి, పంచాయతీరాజ్ డీఈఈ, ఏఈఈలు పలువురు ఉన్నారు.


దామర్‌చెడ్ పాఠశాలలో అభివృద్ధి పనులపై ఆరా తీస్తున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

శంషాబాద్ రూరల్, అక్టోబరు 9: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన శంషాబాద్ మండలంలో జరిగింది. ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గండిగూడ ఆటోనగర్ కమాన్ సమీపంలో బుధవారం ఉదయం ఎన్‌హెచ్ 44 రోడ్డును ఓ గుర్తుతెలియని వ్యక్తి దాటుతుండగా శంషాబాద్ నుంచి షాద్‌నగర్ వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. స్థానికులు గమనించి డయల్ 100కు సమాచారం ఇచ్చారు. అనంతరం పోలీసులు అంబులెన్స్‌లో ఉస్మానియాకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. అతడి వయసు 50-55 సంవత్సరాలు ఉంటుందని, బ్లూకలర్ షర్ట్, గ్రేకలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, తెలుపు గడ్డం, పొడవైన జుట్టు ఉందని తెలిపారు. స్థానికులను విచారించగా బిక్షాటన చేసే వ్యక్తిగా అనుమానం వ్యక్తం చేశారు.

యువకుడు అదృశ్యం.. కేసు నమోదు

శంషాబాద్ రూరల్, అక్టోబరు 9: యువకుడు అదృశ్యమైన సంఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. శంషాబాద్ మండలం తొండపల్లికి చెందిన జగదీశ్వర్ ఈనెల 1న సొంత గ్రామం అప్పారెడ్డిగూడకు వెళ్లున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. అతడి తల్లి అలివేలు శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.


జగదీశ్వర్

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

● 28క్వింటాళ్లు స్వాధీనం.. వాహనం సీజ్

కందుకూరు, అక్టోబరు 9: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బుధవారం మండల కేంద్రంలోని కొత్తగూడలో పట్టుకున్నారు. అధికారి విజయ్ కథనం మేరకు.. కడ్తాల మండలం ముద్విన్ నుంచి మహేశ్వరం మండలం కోళ్లపడకల్‌కు తరలిస్తున్న 28 క్వింటాళ్ల బియ్యాన్ని సిబ్బందితో కలిసి కొత్తగూడ వెళ్లే రోడ్డుపై పట్టుకున్నారు. డ్రైవర్‌ను విచారించగా వివరాలు వెల్లడించినట్లు సీఐ సీతారాం తెలిపారు. ఎస్వోటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దసరా మామూళ్లంటూ వైద్యుడికి బెదిరింపులు

ఐదుగురు ఆన్‌లైన్ రిపోర్టర్లపై కేసు

చేవెళ్ల, అక్టోబర్ 9 : దసరా మామూళ్ల కోసం వైద్యుడిని బెదిరించిన ఐదుగురు ఆన్‌లైన్ రిపోర్టర్లపై శంకర్‌పల్లి పోలీసులు మంగళవారం అర్ధరాత్రి కేసు నమోదు చేశారు. శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలోని శ్రీలక్ష్మీ నర్సింగ్ హోమ్ ఆసుపత్రికి ఆన్‌లైన్ రిపోర్టర్లు రాజేష్‌గౌడ్, సాయి కిరణ్ రెడ్డి, ప్రతాప్, సుధాకర్ గౌడ్, మల్లేష్ గౌడ్‌లు మంగళవారం సాయంత్రం దసరా మామూళ్ల కోసమని వెళ్లారు. రూ.10 వేలు ఇవ్వాలని ఆసుపత్రి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. అయితే, డబ్బులు ఇచ్చేది లేదంటూ వైద్యుడు లక్ష్మీకాంత్‌రెడ్డి ఖరాకండిగా చెప్పారు. డబ్బులు ఇవ్వకపోతే ఆసుపత్రికి సంబంధించిన లొసుగులను బయటపెట్టి, లైసెన్సును రద్దు చేయిస్తామని రిపోర్టర్లు బెదిరించారు. దాంతో లక్ష్మీకాంత్‌రెడ్డి శంకర్‌పల్లి పోలీసులకు ఆ ఐదుగురిపై ఫిర్యాదు చేశాడు. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్ గౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బులు డిమాండ్ చేసిన కేసులో

ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ మెంబర్‌కు రిమాండ్

శంషాబాద్ రూరల్, అక్టోబరు 9 : డబ్బులు డిమాండ్ చేసిన కేసులో ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ మెంబర్‌ను అరెస్టు చేసి రిమాండ్ విధించిన ఘటన శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి కథనం మేరకు.. జూపల్లి బాలమ్మ మెమోరియల్ సంస్థలో పని చేసే మోహన్‌రావు వద్ద ముచ్చింతల్‌కు చెందిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ మెంబర్ చిలకమర్రి నర్సింహ రూ.పది లక్షలు తీసుకుని మరిన్ని డబ్బులు కావాలని వేధిస్తున్నాడు. ఈనెల 2న బాధితుడు శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ మెంబర్ కావున న్యాయ సలహా తీసుకొని బుధవారం అదుపులోకి తీసుకుని న్యాయమూర్తి ముందు హాజరుపర్చారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే, నిందితుడు వాట్సాప్ కాల్ చేసినట్లు బాధితుడి వద్ద ఆధారాలు ఉన్నాయని చెప్పారు. షైహోం గ్రూప్ అధినేత జూపల్లి జగపతిరావు మీద గత కొన్ని రోజుల క్రితం చిలకమర్రి నర్సింహ శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అతడిపై కూడా కేసు నమోదు చేశారు పోలీసులు.

త్వరలో కొత్తూర్‌కు జూనియర్ కళాశాల

కొత్తూర్, అక్టోబరు 9: కొత్తూర్ మండల కేంద్రానికి త్వరలో జూనియర్ కళాశాల మంజూరు కానుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం ఆవరణలో సర్వశిక్షా అభియాన్ పథకం కింద దాదాపు 3.50కోట్లతో నిర్మించనున్న అదనపు తరగతుల భవన నిర్మాణం పనులను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శంకర్ మాట్లాడుతూ పారిశ్రామికంగా, వ్యాపారపరంగా దినాదినాభివృద్ధి చెందుతున్న కొత్తూర్ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటులో గత పాలకులు నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. కొత్తూర్-జేపీ దర్గా, కొత్తూర్-కుమ్మరిగూడ రోడ్లను ప్రజలకు వీలుగా ఉన్నంతవరకే రోడ్డును నిర్మిస్తామని, ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్, వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్ సోమ్లనాయక్, కాంగ్రెస్ మున్సిపల్, మండల శాఖల అధ్యక్షులు జె.సుదర్శన్ గౌడ్, హరినాథ్‌రెడ్డి, నాయకులు అంబటి ప్రభాకర్, వీరమోని దేవేందర్‌ముదిరాజ్, ఇందూరి శ్రీనివాస్, కర్రోళ్ల సురేందర్, జగన్‌గౌడ్, ఎమ్మె సత్తయ్య, మసుపుల మహేందర్, పాశం కృష్ణ, కోటేశ్వర్, శివశంకర్, అక్కవానిగూడ రాజు, చిలకమర్రి నర్సింహ, సాయి తేజ, తదితరులు పాల్గొన్నారు.


కొత్తూర్ : కేజీబీవీలో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

పేదల వైద్యానికి ప్రభుత్వ సహకారం

షాద్‌నగర్ అర్బన్ : పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తున్నదని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని 76మందికి రూ. 19,39,500 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం పొందిన పేదలకు ప్రభుత్వం విరివిగా ఆర్థిక సాయం అందిస్తూనే ఉంటుందని, ప్రభుత్వాసుపత్రుల్లో సౌకర్యాలను కల్పించి, మంచి వైద్యం అందించడానికి చర్యలు తీసుకుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల ముఖ్యనాయకులు పాల్గొన్నారు.


చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

పేదల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట

ఆమనగల్లు, అక్టోబరు 9: పేదల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమనగల్లు, కల్వకుర్తి, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల, వెల్దండ మండలాలకు చెందిన 300 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కల్వకుర్తి అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డిలతో కలిసి కసిరెడ్డి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ ఎఫ్ పేదలకు వరం అని అన్నారు. ఆమనగల్లు పట్టణంలో రూ.17.57 కోట్లతో అధునాతన ఆసుపత్రి భవనాన్ని నిర్మిస్తున్నట్లు వివరించారు. వెల్దండ ప్రభుత్వాసుపత్రికి నూతన భవన నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరు చేయాలని సీఎంను కోరగా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. కాంగ్రెస్ మండలాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, జగన్, డీసీసీ ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఖాదర్‌ఖాద్రీ, శ్రీశైలం, నాయకులున్నారు.

ఆర్థిక సాయం అందజేత

కడ్తాల్, అక్టోబరు 9: జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ సేవలను కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు విస్తరిస్తామని ట్రస్ట్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. మండలంలోని కానుగుబావి తండా, రావిచెడ్‌లో బుధవారం పర్యటించారు. కానుగు బావి తండాలో అనారోగ్యంతో మృతిచెందిన ఇస్లావత్ బిచ్చి, రావిచెడ్‌కు చెందిన కళావతి కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ట్రస్ట్ ద్వారా రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. మాజీ ఎంపీటీసీ గోపాల్, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యనాయక్, నాయకులు రాములు, పాండు, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న దశరథ్‌నాయక్

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

ఆమనగల్లు/కందుకూరు/కేశంపేట/చౌదరిగూడ/కొందుర్గు, అక్టోబరు 9: ఆమనగల్లు మండలానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులను బుధవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. కొడంగల్ నియోజకవర్గంలోని బొమ్మరాస్ పేట, దుద్యాల మండలాల పరిధిలో ఫార్మా కంపెనీ ఏర్పాటును నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తలపెట్టిన పాదయాత్రకు మద్దతుగా ఆమనగల్లు నుంచి బయలు దేరుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు అప్రమత్తమయ్యారు. బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యనాయక్, జిల్లా నాయకుడు గుత్తి బాలస్వామి, మున్సిపాలిటీ కార్యదర్శి వడ్డెమోని శివకుమార్, సోషల్ మీడియా కన్వీనర్ గణేశ్‌లను స్టేషన్‌కు తరలించారు. అలాగే బీఆర్‌ఎస్ నేతలను ఉదయం కందుకూరు పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కమిటీ నేతృత్వంలో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి భారీగా నేతలు కొడంగల్‌కు తరలివెళ్లడానికి సిద్ధమవుతుండగా ఉదయం గ్రామాల నేతలను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నేతలు సురేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కాకి దశరథ, క్రిష్ణదీక్షిత్‌రెడ్డి. గణేష్, మహేష్, రాజులను అరెస్టు చేశారు. అలాగే షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తనయులు కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్, మురళీకృష్ణలను మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేటలో వారి స్వగృహంలో ముందస్తుగా అరెస్ట్ చేశారు. కేశంపేట ఏఎస్ఐ నర్సింలు, పీసీ శ్రీశైలంగౌడ్ సాయంకాలం వరకు అక్కడే ఉన్నారు. మాజీ ఎంపీపీ మట్లాడుతూ రైతుల పక్షాన బీఆర్‌ఎస్ పాదయాత్ర చేస్తుంటే కాంగ్రెస్ అక్రమంగా అరెస్టులు చేస్తుందన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ, కొందుర్గు మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో కొందుర్గు మాజీ ఎంపీపీ రాజేష్ పటేల్, శ్రీధర్‌రెడ్డి, రామకృష్ణ, బాబురావు, అక్రం, వెంకటేష్, శేఖర్ తదితరులున్నారు.


కొందుర్గు : పోలీసుల అదుపులో నాయకులు

మహేందర్ రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



మహేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మధుసూదన్‌రెడ్డి, భీంభరత్ తదితరులు

షాబాద్/షాద్‌నగర్, అక్టోబరు 9 : రాష్ట్ర శాసనమండలి చీఫ్ విప్‌గా డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి బుధవారం నగరంలో బాధ్యతలు చేపట్టిన తరుణంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, నాయకులు రాజేందర్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, రమేష్, యాదయ్య, సతీష్‌యాదవ్ తదితరులు శాలువాలతో సన్మానించారు. మహేందర్‌రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డిని శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడల్లో రాణించాలి : పీవీఆర్

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు 9: క్రీడల్లో ప్రతిభ కనబరిచి ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి(పీవీఆర్) తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల శివారులోని కాలనీ తండాలో నిర్వహిస్తున్న సీపీఎల్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌ను బుధవారం ప్రారంభించారు. నిర్వాహకులు బాబు నాయక్, శివలను అభినందించారు. నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, లష్కర్‌నాయక్, సుధాకర్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

రోడ్డుకు అడ్డంగా చెట్లకొమ్మలు.. తొలగించిన నాయకులు



కేశంపేట, అక్టోబరు 9: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ నుంచి వెంకటేశ్వర హేచరీస్ వరకు రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లకొమ్మలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చేవెళ్ల నర్సింలు, కటికల హనుమంతు, మధునాల శివానంద్, ఉత్తరపల్లి శంకరయ్య, సత్యంగౌడ్, కుమ్మరి శేఖర్‌లు బుధవారం ఎక్సకావేటర్‌తో చెట్ల కొమ్మలను తొలిగించారు.

జ్యోతీ అల్వాల్ రెడ్డికి ఘన సన్మానం

కడ్తాల్, అక్టోబరు 9: బాదేపల్లి మార్కెట్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జ్యోతీ అల్వాల్‌రెడ్డిని బుధవారం ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డిలు నగరంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సత్కరించి అభినందించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. డీసీసీ ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, కాంగ్రెస్ తలకొండపల్లి, ఆమనగల్లు మండలాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, జగన్, మాజీ ఎంపీటీసీ అంబాజీ, నాయకులు రవి, ఆరిఫ్, కృష్ణ, తదితరులున్నారు.



దోమల నివారణకు 'ఫాగింగ్'

చేవెళ్ల, అక్టోబరు 9 : మండల పరిధిలోని పామెన గ్రామంలో కొద్ది రోజులుగా దోమల బెడద అధికంగా ఉండడంతో గ్రామానికి చెందిన బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్ ముదిరాజ్ ముందుకు వచ్చి గ్రామంలో బుధవారం దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయించారు. అన్ని వార్డుల్లో దోమల మందు పిచికారీ చేయించాడు. ఈ సందర్భంగా ఆయన్ను గ్రామస్తులు అభినందించారు.


ఫాగింగ్ చేయిస్తున్న కృష్ణమోహన్ తదితరులు

అంతర్గత రోడ్డుకు మరమ్మతులు

ఆమనగల్లు, అక్టోబరు 9: మున్సిపాలిటీలోని 3వ వార్డు నుచ్చుగుట్ట తండాలో ఇటీవల వర్షాలకు అంతర్గత రోడ్లపై మట్టి కొట్టుకుపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మున్సిపాలిటీ పాలకవర్గానికి తెలిపిన స్పందించలేదు. దాంతో మాజీ జడ్పీటీసీ అనురాధ పత్యనాయక్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లగా బుధవారం రోడ్లపై గోతుల్లో మట్టిపోసి చదును చేయించారు. నాయకులు తదితరులున్నారు.

సరస్వతీదేవిగా దుర్గామాత

దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా భక్తులకు దుర్గామాత బుధవారం సరస్వతీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా, దసరా ఉత్సవాలను జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నారు.


కందుకూరు : పూజలో మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ నాయకులు


చేవెళ్ల : మల్కాపూర్‌లో నిర్వహించిన పూజల్లో భక్తులు


కడ్తాల్ : మైసిగండిలో పూజల్లో సిరోలిపంతూ,స్నేహలత


యాచారం : నందివనపర్తిలో చండీహోమం..


ఇబ్రహీం పట్నం : బృందావన్ కాలనీలో పూజల్లో ఎంపీ ఈటల


బతుకమ్మ సంబురాలు
ఇబ్రహీంపట్నంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి..